
తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
సోమవారం
24 ఆగస్టు 2026



## ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతంకు సహకరించాలి

- **పారదర్శకమైన ఓటరు జాబితాకు కృషి**
- **ఆగస్టు 27న వార్డ్, గ్రామ సభలు**
- **జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 23(జనంసాక్షి):** జోగులాంబ గద్వాల జిల్లాలో ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైన ఓటర్లకు నోటీసుల జనరేషన్, డెలివరీ, అభ్యంతరాల స్వీకరణ, తదుపరి హియరింగ్ ప్రక్రియలను వేగవంతం చేయడానికి మండలాల వారీగా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు.

ప్రస్తుతం గద్వాల, అలంపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో హేతుబద్ధీకరణ అనంతరం మొత్తం 594 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 1,48,674 మంది ఓటర్లకు నోటీసులు ఇవ్వాల్సి ఉందన్నారు. ఇప్పటివరకు 47,218 నోటీసులు జనరేట్ కాగా, 31.76 శాతం పురోగతి నమోదైందని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న నోటీసుల జనరేషన్‌ను త్వరితగతిన పూర్తిచేయడానికి సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఆగస్టు 22న బిఎల్వోలు సంబంధిత బిఎల్ఏలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి తగు సూచనలు చేశారన్నారు. ఈ సమావేశంలో నోటీసుల జనరేషన్, పెండింగ్ నోటీసుల పరిష్కారం, నోటీసుల డెలివరీ, ప్రజల అభ్యంత రాల స్వీకరణతో పాటు ఆగస్టు 27న ప్రతి గ్రామంలో నిర్వహించనున్న వార్డు, గ్రామ సభల ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించి, సంబంధిత సిబ్బందికి సూచనలు చేశారన్నారు. గ్రామ సభల్లో ప్రజలకు ఓటర్ల జాబితా మరియు సంబంధిత ప్రక్రియపై అవగాహన కల్పించడంతో పాటు, ప్రజల అభిప్రాయాలు మరియు అభ్యంతరాలను స్వీకరించడం జరుగుతుందన్నారు. వార్డు గ్రామ సభలు సజావుగా జరిగేలా అధికారులు, బిఎల్ ఓలు, బిఎల్ఏలు, ఇతర సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలు గ్రామసభలకు పెద్ద సంఖ్యలో హాజరై, తమ పేరు, కుటుంబ సభ్యుల వివరాలు ఓటుకు సంబంధించిన సమాచారాన్ని పరిశీలించుకోవాలని కోరారు. ఓటర్ల జాబితాలో తమ పేరు సక్రమంగా ఉందో లేదో ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవాలని, ఏవైనా తప్పులు లేదా అభ్యంతరాలు ఉంటే గ్రామసభలో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆగస్టు 27న నిర్వహించనున్న గ్రామసభలను ప్రజలు సద్వినియోగం చేసుకొని, ప్రజాస్వామ్య ప్రక్రియలో తమ భాగస్వామ్యాన్ని నిర్ధారించుకోవాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.



## డిఎస్పీ ఆధ్వర్యంలో కార్డన్ అండ్ సెర్చ్

- **పలు వాహనాలు స్వాధీనం**





**రాజాపూర్, ఆగస్టు 23(జనంసాక్షి):** మహబూబ్నగర్ డిఎస్పి ఆధ్వర్యంలో రాజాపూర్ మండలంలోని ముదిరెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున 60 మంది పోలీసు అధికారులతో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించడం జరిగింది. తనిఖీల్లో భాగంగా వాహన పత్రాలు సరిగ్గా లేని 23 ద్విచక్ర వానాలు, ఒక కారు స్వాధీనపరచుకోవడం జరిగింది. డి.ఎస్.పి మాట్లాడుతూ ముదిరెడ్డిపల్లి గ్రామం సెజ్ సమీపంలో ఉన్నందున ఎక్కువ మంది ఉత్తర రాష్ట్రాల వారు జీవనోపాధి కోసం ఇక్కడికి వస్తారు. వారికి ఇక్కడ రూములు అద్దెకు ఇచ్చేటప్పుడు వారికి సంబంధిత ఆధార కార్డులు , ఫోన్ నెంబర్లు ఇంటి యజమానులు కచ్చితంగా తీసుకోవాలని వారు ఎటువంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలు చేయకుండా బాధ్యత వహించాలని సూచించారు. ఇంటి యజమానులు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తే ఏ ఇంట్లో ఉన్న వారు చట్టవ్యతిరేక కార్యకలాపాలు, మత్తు పదార్థాల వినియోగం చేసిన ఆ ఇంటి యాజమానులు నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో మహబూబ్నగర్ డిఎస్పి వెంకటేశ్వర్లు, డిసిఆర్బి డిఎస్పి రమణారెడ్డి, జడ్చర్ల రూరల్ సిఐ మహేష్, జడ్చర్ల టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కమలాకర్ , రాజాపూర్ ఎస్సై రాజశేఖర్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించిన ఎమ్మెల్యే

**మల్దకల్, ఆగస్టు 23(జనంసాక్షి):** మండలం పరిధిలోని తాటికుంట గ్రామంలో ఆదివారం ఇందిరమ్మ ఇల్లు నూతన గృహప్రవేశనికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరై గ్రామంలో ఇందిరమ్మ లబ్ధిదారులు నర్సింహులు, గోవిందులకు చెందిన ఇందిరమ్మ ఇండ్లను ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

**ఎమ్మెల్యే మాట్లాడుతూ...**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలైన ప్రజలకు ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేయించి వారికి విడతల వారీగా వారి ఖాతాలు డబ్బులను ఐదు లక్షల రూపాయలను నమోదు చేయడం జరిగింది. వాటికి తోడుగా లబ్ధిదారులు మరికొంత డబ్బులతో ఇంటిని అన్ని వసతులతో ఏర్పాటు చేసుకోవడం జరిగినది. ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళుగా మా సొంతింటి కల ప్రజాపాలన సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సారథ్యంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సహకారంతో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి మాకు చాలా సంతోషంగా ఉన్నది మేము ఎల్లప్పుడూ సీఎంకి మంత్రికి ఎమ్మెల్యేకి రుణపడి ఉంటామని వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సరోజ నర్సింహులు, జిల్లా సీనియర్ నాయకులు పటేల్ ప్రభాకర్ రెడ్డి, సింగల్ విండో ఛైర్మెన్ తిమ్మారెడ్డి, మాజీ ఎంపీపీ



విజయ్, నాయకులు రమేష్ రెడ్డి, అజయ్, చంద్రశేఖర్ రెడ్డి, భానుప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

## బీచుపల్లిని సందర్శించిన ప్రముఖ ప్రవచనకర్త బాచంపల్లి సంతోష్ కుమార్



**ఎర్రవల్లి, ఆగస్టు 23 (జనంసాక్షి):** ప్రముఖ ప్రవచనకర్త బాచంపల్లి సంతోష్ కుమార్ ఆదివారం ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బీచుపల్లి శ్రీ ఆంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో పురందర్ కుమార్, అర్చకులు ఘనంగా స్వాగతం పలికి ఆలయంలో గోత్ర నామాలతో అర్చనలు చేశారు. అనంతరం స్వామివారి శేష వస్త్రం, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ కృష్ణా నది ఒడ్డున ఉన్న బీచుపల్లి క్షేత్రం ఎంతో మహిమాన్విత మైనదని, ఇక్కడ స్వామివారిని దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో ఆలయ సిబ్బంది తీరును ఆయన అభినందించారు.

## ఆటోల బందును జయప్రదం చేయాలి

- **ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలబెట్టుకోవాలి**
- **ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి**

**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఆగస్టు 23(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ పబ్లిక్ ప్రైవేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు కురుమూర్తి, ప్రధాన కార్యదర్శి పొదిల రామయ్య డిమాండ్ చేశారు. ఆగస్టు 24న జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ఆటోల బందును నాగర్‌కర్నూల్ జిల్లాలో విజయవంతం చేయాలని కోరుతూ నాగర్‌కర్నూల్ మండలం శ్రీపురం గ్రామంలో ఆటో కార్మికులతో కలిసి వారు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కురుమూర్తి, పొదిల రామయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం వల్ల ఆటో రవాణా రంగ కార్మికుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడిందన్నారు. ఆటో కార్మికులకు నెలకు రూ.12 వేల జీవన భృతి అందిస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం ఇప్పటికీ అమలు చేయలేదని ఆరోపించారు.

ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా ముఖ్యమంత్రి, రవాణా శాఖ మంత్రి ఆటో కార్మి కుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు.

ఎంతోకాలంగా ఆటో రవాణా రంగ కార్మికులు తమ హక్కుల కోసం పోరాడుతున్నప్పటికీ ప్రభుత్వం వారి సమస్యలపై సరైన దృష్టి సారించడం లేదన్నారు.




రవాణా రంగ కార్మికుల కోసం ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, ప్రమాద బీమా, సామాజిక భద్రత వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులు ప్రమాదాల్లో మృతి చెందినప్పుడు వారి కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయని, వారికి ప్రభుత్వం అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు.

అలాగే ఆటో లైసెన్సులను లైట్ మోటార్ వెహికల్ లైసెన్సులుగా మార్చాలని, అక్రమ యాప్ ఆధారిత రవాణా సేవలను నియంత్రించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆటో చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల వేధింపుల నుంచి ఆటో డ్రైవర్లను రక్షించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

మిగతా 6లో..

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ

**ఉప్పునుంతల, ఆగస్టు 23 (జనంసాక్షి):**
ఉప్పునుంతల మండల కేంద్రంలో మండల రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు, డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల రెవెన్యూ అధికారి సునీత, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు.
**ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..** పేద ప్రజలను దృష్టిలో ఉంచుకుని ప్రజా పాలనలో భాగంగా ప్రతి అర్హ కుటుంబానికి రేషన్ కార్డు అందించడంతోపాటు సన్నబియ్యం అందించాలనే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.
గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో అందించిన రేషన్ కార్డులతో అనేక కుటుంబాలు లబ్ధి పొందాయని,ఆ తర్వాత కుటుంబాల్లో పిల్లలు పుట్టి, వారికి వివాహాలు జరిగి, కొత్త కుటుంబాలు ఏర్పడినా గత ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులు అందించకపోవడం బాధాకరమన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత ప్రభుత్వం అర్హులైన కుటుంబాలకు ఏటీఎం కార్డుల తరహాలో స్మార్ట్ రేషన్ కార్డులను అందిస్తోందని తెలిపారు.



రైతులు పండించిన సన్నధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ అందించడంతోపాటు ధాన్యాన్ని కొనుగోలు చేసి, అదే సన్నబియ్యాన్ని ప్రజలకు రేషన్ ద్వారా అందిస్తున్నామని ఎమ్మెల్యే గుర్తుచేశారు.



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు వంటి పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలపై ఒక్కసారి ఆలోచించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, యువకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు పాటిస్తూ మిలాద్ జులూస్ నిర్వహించాలి: ఎస్సై కురుమూర్తి

**కల్వకుర్తి, ఆగస్టు 23(జనంసాక్షి):** మిలాద్-ఉన్-నబీ సందర్భంగా ఈ నెల 26న కల్వకుర్తి పట్టణంలో నిర్వహించనున్న జులూస్‌ను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఎస్సై కురుమూర్తి కోరారు. ముస్లిం మైనార్టీలు సమన్వయంతో వ్యవహరిస్తూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా వేడుకలను నిర్వహించాలని సూచించారు. జులూస్‌ను నిర్ణీత సమయానికి ప్రారంభించి, నిర్దేశించిన సమయంలోనే ముగించాలని ఎస్సై తెలిపారు.సుప్రీంకోర్టు, ప్రభుత్వ నిబంధనల ప్రకారం డీజేలు,అధిక శబ్దం చేసే సౌండ్ సిస్టమ్స్‌కు అనుమతి లేదని స్పష్టం చేశారు.ఆధ్యాత్మిక వాతావరణానికి ప్రాధాన్యమిస్తూ వేడుకలు నిర్వహించాలన్నారు.




మైనర్లు వాహనాలు నడపడం, బైక్‌లపై ట్రిపుల్ రైడింగ్ చేయడం,సైలెన్సర్లు తొలగించి ర్యాష్ డ్రైవింగ్ చేయడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమన్నారు. నిర్ణీత తేదీకి ముందుగా ఎలాంటి బైక్ ర్యాలీలకు అనుమతి లేదని తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్ దీపాలంకరణ విషయంలో అప్రమత్తంగా ఉండాలని, జెండాలు విద్యుత్ తీగలకు తగలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.అన్నదాన కేంద్రాల వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వలంటీర్లు పోలీసులతో సమన్వయం చేసుకోవాలన్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు,విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసే వారిపై నిరంతరం నిఘా ఉంటుందని ఎస్సై కురుమూర్తి స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
ఈ సమన్వయ సమావేశంలో రెండో ఎస్సై రాజశేఖర్,కల్వకుర్తి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ షనవాజ్ ఖాన్, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# నేడు మెదక్ పట్టణంలో పీఏసీ సమావేశం

- కాంగ్రెస్ బలోపేతానికి కీలక నిర్ణయాలపై చర్చ..
- పీఏసీ సమావేశానికి భారీగా తరలిరావాలి
- కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగుల గారి మల్లేశం గౌడ్



**కొల్చారం, ఆగస్టు 23 (జనంసాక్షి):** మెదక్ పట్టణంలోని వినాయక ఫంక్షన్ హాల్‌లో నేడు ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ పీఏసీ సమావేశం నిర్వహించనున్నట్లు కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగులగారి మల్లేశం గౌడ్ తెలిపారు.
ఈ సమావేశానికి టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ నర్సింహ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి, జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, జిల్లా అధ్యక్షులు రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడ్‌తో పాటు ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జిలు హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశానికి కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని నాగులగారి మల్లేశం గౌడ్ పిలుపునిచ్చారు.

# మనియార్పల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం

- పేదలందరికీ సొంతిళ్లు కల్పించడమే రేవంత్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యం
- పేదల ఇంటి కల నెరవేరుస్తాం: సర్పంచ్ రాజకుమార్

**కోహీర్, ఆగస్టు 23 (జనంసాక్షి):** అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి, సొంతింటి కలను నెరవేర్చడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మనియార్పల్లి సర్పంచ్ రాజ్‌కుమార్ అన్నారు. కోహీర్ మండలంలోని మనియార్పల్లి గ్రామంలో నూతనంగా మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు శనివారం ఆయన కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేశారు.
ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. దశలవారీగా అర్హులైన వారిని గుర్తించి నివేదికల ఆధారంగా ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు అధికారుల సూచనలు, నిబంధనల ప్రకారం నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు.
గత పాలకులు పేదల సొంతింటి కలను విస్మరించారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం అర్హులైన నిరుపేదలకు పక్కా ఇళ్లు అందించేందుకు చర్యలు చేపట్టిందని రాజ్‌కుమార్ పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణంలో దళారీ వ్యవస్థకు తావులేకుండా లబ్ధిదారుల ఖాతాల్లోకే నేరుగా ఆర్థిక సాయం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పేదల సంక్షేమం, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



# పేట జిల్లా మహిళా కబడ్డీ జట్ల ఎంపిక



**నారాయణపేట, ఆగస్టు 23(జనంసాక్షి):**
నారాయణపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా మహిళా కబడ్డీ జట్ల ఎంపికలు ఆదివారం నారాయణపేట స్టేడియం గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ ఎంపిక పోటీలకు జిల్లా నలుమూలల నుంచి సుమారు 500 మంది మహిళా క్రీడాకారిణులు ఉత్సాహంగా హాజరై తమ ప్రతిభను ప్రదర్శించారు.ప్రతిభావంతులైన క్రీడాకారిణులను ఎంపిక చేసి జిల్లా జట్లకు ప్రాతినిధ్యం వహించే అవకాశం కల్పించనున్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ చెన్నారం వెంకటప్ప ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట 320రూ మల్టిపుల్ కౌన్సిల్ మెంబర్ లయన్ డాక్టర్ హరి నారాయణ భట్టడ్ క్రీడాకారిణులను పరిచయం చేసుకొని, వారితో మాట్లాడి, వారి భవిష్యత్ క్రీడా ప్రయాణానికి ఆల్ ది బెస్ట్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగేశ్వర్ రెడ్డి, రిటైర్డ్ పిఇటి నరసింహులు, లయన్ బి.సాయినాథ్, పాస్ట్ సెక్రటరీ, వారియర్స్ డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ లయన్ శాంత, లయన్ ఎస్.చక్రవర్తి, వ్యాయామ ఉపాధ్యాయులు అనంతసేన, బాలరాజు, వేణు, శేఖర్ , భీమ్ రెడ్డి గారు, గణేష్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా మహిళా క్రీడాకారిణులకు కబడ్డీలో మంచి అవకాశాలు కల్పిస్తూ, వారి ప్రతిభను ప్రోత్సహిస్తున్న నారాయణపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్‌కు అభినందించారు.

# దాచారంలో ఘనంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**బెజ్జంకి, ఆగస్టు 23(జనంసాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని దాచారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బైరా మనసా రాజేందర్ ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత సులభంగా, పారదర్శకంగా అందే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.గ్రామంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దీటి బాలనర్స్, గ్రామ జీపీఓ సమ్మయ్య, పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు అశోక్, మహేష్, చంద్రయ్య, రేషన్ డీలర్ నవీన్, లబ్ధిదారులు, గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ రాచన్న స్వామికి లక్ష బిల్వార్చన



**సదాశివపేట, ఆగస్టు 23 (జనంసాక్షి):**
బడంపేట శ్రీ రాచన్న స్వామి ఆలయంలో శ్రావణ మాసం పురస్కరించుకొని స్వామివారికి లక్ష బిల్వర్చన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ సమాజం సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఇప్పపల్లి నర్సింలు కుటుంబ సమేతంగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి రాజన్న స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించి శాలువా పూలమాలతో సత్కరించి ఆశీర్వదించారు.

# రైతు సంక్షేమానికే డిజిటల్ పంటల సర్వే

- గుడిగండ్లలో అధికారుల పరిశీలన



**మక్తల్, ఆగస్టు 23 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న డిజిటల్ పంటల సర్వే ప్రక్రియ మక్తల్ మండలంలోని గుడిగండ్ల గ్రామంలో ఆదివారం కొనసాగింది. వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, పత్తి పంట పొలాల్లో సర్వే నంబర్ల ఆధారంగా పంట సాగు వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేశారు.

ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు మాట్లాడుతూ రైతులకు సంక్షేమ పథకాలు, పంట రుణాలు మరియు భవిష్యత్తులో పంట నష్టం జరిగితే పరిహారం పారదర్శకంగా అందడానికి ఈ సర్వే ప్రామాణికంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచ్ బాలకృష్ణ, కాంగ్రెస్ నాయకులు భారత సింహా రెడ్డి, మోహన్ రెడ్డి, తిరుపతి, కూసురు రాజు, గణేష్, తిప్పప్ప, అప్పన్న, అంజి, ముష్టిరాజు, నిజాం మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

# వర్షాలకు దెబ్బతిన్న గ్రామ రహదారులు... గుంతలతో ప్రజలకు ఇబ్బందులు

- అడ్డాకుల ప్రధాన రహదారులు గుంతలతో అస్తవ్యస్తం
- నాలుగో వార్డ్ కాలేజీకి వెళ్లే దారిలో చాలా రోజుల నుండి గుంతలు
- రోడ్లపై ఏర్పడిన గుంతలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు



**అడ్డాకుల, ఆగస్టు 23(జనంసాక్షి):** వర్షాలు కురుస్తున్న వేళ అడ్డాకుల మండల కేంద్ర ప్రాంతాల్లో రహదారుల పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారుతోంది. అధికారులు చూసుకుంటూ వెళ్లే దారిలోనే వర్షపు నీరు నిలిచిపోవడంతో ఇప్పటికే బలహీనంగా ఉన్న రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలోని నాలుగో వార్డ్ కాలేజీకి వెళ్లే దారిలో చాలా రోజుల నుండి రెండు గుంతలు, పాఠశాల వెనుక ప్రధాన రహదారులు, అంతర్గత వీధుల్లో వర్షపు నీరు నిలవడంతో రోడ్లు దెబ్బతిన్నాయి. కొన్ని ప్రాంతాల్లో చిన్న గుంతలు క్రమంగా పెద్దవిగా మారుతున్నాయి. చాలా రోజుల నుండి ఆ గుంతలను పట్టించుకోకపోవడంతో చెట్లు మొలుస్తున్నాయి. రాత్రి వేళల్లో గుంతలు కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వృద్ధులు, అత్యవసర పనుల కోసం ప్రయాణించే ప్రజలు కూడా ఈ రహదారుల పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సర్పంచులు వార్డు సభ్యులు గెలిచి చాలా రోజుల అవుతున్న ఇప్పటివరకు గ్రామ అభివృద్ధిని చేయలేకపోతున్నారు.రోడ్లపై ఏర్పడిన గుంతలను వెంటనే గుర్తించి మరమ్మతులు చేపట్టాలని సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి అభివృద్ధి అధికారులను గ్రామస్తులు కోరుతున్నారు. వర్షాలు మరింత కొనసాగితే సమస్య తీవ్రతరం అయ్యే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు.వర్షం పడటం సహజమే అయినప్పటికీ, రోడ్లపై నీరు నిలవకుండా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం, బ్యాంకు కు వెళ్లే రూట్ లో పెద్ద గుంతతో దెబ్బతిన్న రోడ్లను నాణ్యతతో మరమ్మతు చేయడం అత్యవసరం. తాత్కాలికంగా గుంతలను పూడ్చడం కంటే, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు వెంటనే స్పందించి రోడ్ల మరమ్మతులు చేపడతారా? లేక మరో ప్రమాదం జరిగిన తర్వాతే చర్యలు తీసుకుంటారా? వేచి చూడాలి. ఈ సమస్యపై సంబంధిత అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

# భక్తుల కల్పవల్లి.. శ్రీ బంగారు మైసమ్మ తల్లి

- ఆగస్టు 30న బోనాల పండుగ మహోత్సవం
- భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని దేవాలయ అభివృద్ధి కమిటీ పిలుపు

**జడ్చర్ల, ఆగస్టు 23(జనంసాక్షి):** నమ్మి కొలిచిన భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతోంది కావేరమ్మపేట శ్రీ బంగారు మైసమ్మ తల్లి దేవత. జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని కావేరమ్మపేట 44వ జాతీయ రహదారి పక్కన డాక్ బంగ్లా సమీపంలో ఉన్న ఈ దేవాలయం, భక్తుల కోరికలు తీర్చే కల్పవల్లిగా వెలుగొందుతోంది. దాతల సహకారంతో ఈ దివ్య క్షేత్రం అంచలంచెలుగా అభివృద్ధి చెందుతోంది. కావేరమ్మపేట, జడ్చర్ల, మండల ప్రజలతో పాటు పరిసర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. ప్రతి ఏటా శ్రావణమాసంలో ఆదివారం బోనాల మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తారు. ఈ క్రమంలో ఈ నెల 30న (ఆదివారం) శ్రీ బంగారు మైసమ్మ తల్లి బోనాల పండుగను ఘనంగా నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు.





**శ్రావణ బోనాల మహోత్సవం:**

బోనాల పండుగ సందర్భంగా మహిళలు, భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లిస్తారు. ఈ సందర్భంగా నిత్య పూజలతో పాటు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

**దేవాలయ ప్రత్యేకత:**

సంతానం లేని వారికి సంతానం, పెళ్లి కాని వారికి వివాహం, ఉద్యోగం లేని వారికి ఉద్యోగం లభిస్తుందని భక్తుల నమ్మకం. అమ్మవారికి. చీర, సారెతో పాటు ఒడిబియ్యంతో బోనం సమర్పిస్తారు. అమ్మవారిని దర్శిస్తే కోరిన కోరికలు తీరుతాయని భక్తుల విశ్వాసం.

**బోనాల నిర్వహణకు ఏర్పాట్లు:**

ఆగస్టు 30న జరిగే బోనాల మహోత్సవానికి దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారికి బోనాలు సమర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని, శ్రీ బంగారు మైసమ్మ తల్లి ఆశీస్సులు పొందాలని కోరారు.

# పెద్ద శంకరంపేటలో భారీ వర్షం




**పెద్ద శంకరంపేట్, ఆగస్టు 23 (జనంసాక్షి):**
పెద్ద శంకరంపేటలో ఆదివారం మధ్యాహ్నం మోస్తారు నుండి భారీ వర్షం కురిసింది. ప్రధాన రహదారిపై భారీగా వర్షం కురవడంతో వర్షపు నీరు చేరింది. దీనికి తోడు పేటలోని పలు మురికి కాలువలు పొంగిపొర్లాయి.. అంతర్గత రహదారులపై గుంతలలో వర్షపు నీరు నిలిచిపోయింది.. దీంతో ప్రజలు కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నారు..

గత కొన్ని రోజులుగా వర్షాలు లేకపోవడంతో ఆదివారం భారీ వర్షం కురియడంతో పలు పంటలకు ఈ వర్షం ఎంతగానో లాభం చేకరుస్తుందని పలువురూ రైతులు పేర్కొంటున్నారు.

# మద్రిలో కాంగ్రెస్‌కు కొత్త నాయకత్వం..!

- కాంగ్రెస్ పగ్గాలు కిషోర్ గౌడ్‌కు



**కోహిర్, ఆగస్టు 23 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలంలో కవెల్లి చౌరస్తాలోని మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మద్రి గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సువర్ణ మల్లన్న పటేల్, సర్పంచ్ వసంత అనిల్ ఆధ్వర్యంలో కమిటీని ఎంపిక చేశారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా కిషోర్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా ఫారూక్ పటేల్ను ఎన్నుకున్నారు. వీరితో పాటు మరో 11 మంది సభ్యులను కమిటీలోకి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సువర్ణ మల్లన్న పటేల్ మాట్లాడుతూ.. మద్రి గ్రామంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నూతన కమిటీ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. నూతన కమిటీ పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ గ్రామంలో కాంగ్రెస్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని నాయకులు సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింలు, కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గౌతపూర్‌లో పుత్రదా ఏకాదశి ప్రత్యేక పూజలు





**బాలానగర్, ఆగస్టు 23 (జనంసాక్షి):** మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం గౌతపూర్ గ్రామంలోని గుట్టపై వెలసిన శ్రీ విజయలక్ష్మి నరసింహ స్వామి దేవాలయంలో శ్రావణమాసం పుత్రదా ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ పీఠాధిపతి, ఆత్మజ్ఞాని శ్రీశ్రీశ్రీ హరిబాలానంద దాసు స్వామి ఆధ్వర్యంలో అభిషేకం, అర్చన, ఆరాధన, యజ్ఞం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శ్రావణమాస ఉపవాసాలు పాటిస్తూ స్వామివారి పూజల్లో పాల్గొనడం తమ అదృష్టమని భక్తులు పేర్కొన్నారు.

ఆలయ కమిటీ భక్తజ్ఞాన సేవాసమితి చైర్మన్, సభ్యులు పీఠాధిపతి స్వామివారి ఆదేశాల మేరకు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారు భక్తులకు పుత్రదా ఏకాదశి విశిష్టతను వివరించారు. పుత్రదా ఏకాదశి హిందూ సంప్రదాయంలో పవిత్రమైన ఏకాదశి వ్రతంగా భావిస్తారు. "పుత్ర దా" అంటే సంతానాన్ని ప్రసాదించేది అని అర్థం. సంతానం, కుటుంబ శ్రేయస్సు, ఆరోగ్యం, సుఖసంతోషాలు, శ్రీమహావిష్ణువు అనుగ్రహం కోసం భక్తులు ఈ వ్రతాన్ని ఆచరిస్తారు. అయితే సంతానప్రాప్తిని వ్రతం ఖచ్చితంగా కలిగించే ఫలితంగా కాకుండా ఆధ్యాత్మిక విశ్వాసంగా చూడాలని పేర్కొంటారు. పురాణ కథనం ప్రకారం సుకేతుమాన్ రాజు సంతానం లేక బాధపడుతుండగా మహర్షుల సూచనతో పుత్రదా ఏకాదశి వ్రతాన్ని ఆచరించాడు. శ్రీమహావిష్ణువును భక్తితో పూజించి, ఉపవాసం పాటించిన అనంతరం ద్వాదశి రోజున పారణ చేయడంతో అతనికి సంతానం కలిగిందని పురాణాలు చెబుతున్నాయి. ఈ కథ భక్తి, నియమం, దైవస్మరణ ప్రాముఖ్యతను తెలియజేస్తుంది.

ఏకాదశి రోజున భక్తులు స్నానం చేసి శుభ్రమైన వస్త్రాలు ధరించి శ్రీమహావిష్ణువు లేదా శ్రీకృష్ణుడిని పూజిస్తారు. దీపారాధన, పుష్పాలు, తులసి దళాల సమర్పణ, విష్ణు సహస్రనామ పారాయణం, "ఓం నమో నారాయణాయ" మంత్రజపం, వ్రతకథ వినడం వంటి ఆచారాలు పాటిస్తారు. తులసి శ్రీమహావిష్ణువుకు ప్రీతికరమైనదిగా భావిస్తారు.

ఉపవాసాన్ని భక్తులు తమ ఆరోగ్యం, శక్తి, కుటుంబ ఆచారాల ప్రకారం నిర్జలంగా, నీటితో, పండ్లు లేదా పాలతో, సాత్వికాహారంతో పాటిస్తారు. అనేక వైష్ణవ సంప్రదాయాల్లో ఏకాదశి రోజున బియ్యం, ధాన్యాలు, పప్పులను నివారిస్తారు. ప్రాంతానుసారం ఆచారాలు మారవచ్చు. ఏకాదశి వ్రతాన్ని ద్వాదశి రోజున పారణతో ముగిస్తారు. పారణ సమయాన్ని స్థానిక పంచాంగం ప్రకారం పాటించడం ఉత్తమమని స్వామివారు తెలిపారు.

# కాలనీల్లో మౌలిక వసతులకు ప్రాధాన్యం

- సొంత నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడం అభినందనీయం: ఎమ్మెల్యే
- ఉస్మాన్‌నగర్ బి-మ్యాక్ సొసైటీలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన





**రామచంద్రాపురం, ఆగస్టు 23(జనంసాక్షి):** కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఉస్మాన్‌నగర్ బి-మ్యాక్ సొసైటీలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు చిట్టి ఉమేష్ సొంత నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే జీఎంఆర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బి-మ్యాక్ సొసైటీ కాలనీ ప్రజల సంక్షేమానికి అండగా ఉంటున్నామని తెలిపారు. కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించామని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి సొంత నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి ముందుకు వచ్చిన చిట్టి ఉమేష్‌ను అభినందించారు. కాలనీల అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు దేవేందర్ యాదవ్, రవీందర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, శ్రీశైలం, శ్రీపాల్‌రెడ్డి, సాగర్, కాలనీ అధ్యక్షుడు సంజీవ్‌ప్రసాద్, మాధవరావు, ఏడుకొండలు, ప్రభాకర్‌రెడ్డి, వాసు దేవరావు, శివనారాయణ, గోవర్ధన్, సందీప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## బొమ్ గొండేశ్వర్
# విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే



**న్యాల్‌కల్, ఆగస్టు 23 (జనంసాక్షి):** యాదవుల కులదైవం,మహాత్మ బొమ్ గొన్దేశ్వర నూతన విగ్రహాన్ని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావ్ ఆవిష్కరించారు. మండలంలోని కల్బేమల్ గ్రామంలో.. యాదవ సంఘం ఆధ్వర్యంలో నూతన విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. విగ్రహావిష్కరణ కార్య క్రమానికి స్థానిక ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. మండ లంలోని వివిధ గ్రామాలకు చెందిన బారాస, యాదవ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.పార్టీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేసి మార్గదర్శనం చేశారు. కార్యక్రమంలో జహీరాబాద్, న్యాల్‌కల్, మొగుడంపల్లి, కోహీర్, ఝరా సంగం, తదితర ప్రాంతాలకు చెందిన పార్టీ, యాదవ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మనోహరాబాద్
# సీనియర్ జర్నలిస్ట్ గొల్ల రమేష్‌కు ఘన నివాళి

- గుండెపోటుతో గొల్ల రమేష్ అకాల మరణం
- జర్నలిస్టు వర్గాల్లో విషాదం




**మనోహరాబాద్, ఆగస్టు 24 (జనంసాక్షి):** మనోహరాబాద్‌కు చెందిన సీనియర్ జర్నలిస్ట్ గొల్ల రమేష్ రాత్రి గుండెపోటుతో అకాల మరణం చెందడంతో జర్నలిస్టు వర్గాల్లో విషాదం నెలకొంది. రమేష్ మరణ వార్త తెలుసుకున్న ఉమ్మడి తూప్రాన్- మనోహరాబాద్ ప్రాంతానికి చెందిన సీనియర్ పాత్రికేయులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. సీనియర్ పాత్రికేయులు, మన కర్తవ్యం ఎడిటర్ లయన్ డాక్టర్ జానకిరామ్ సిఆర్ ఆధ్వర్యంలో రమేష్ భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి, తీవ్ర సానుభూతిని తెలియజేశారు.మృతుని కుటుంబానికి ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. ఉమ్మడి తూప్రాన్ -- మనోహరాబాద్ ప్రెస్ క్లబ్ తరపున గొల్ల రమేష్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, జర్నలిజం రంగానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు ఆర్. శివశంకర్ గౌడ్, నమస్తే తెలంగాణ తూప్రాన్ డివిజన్ రిపోర్టర్ తీగుళ్ల నాగరాజు, టీవీ5 తూప్రాన్ డివిజన్ రిపోర్టర్ గైనిబైటి భాస్కర్ గౌడ్, సూర్య రిపోర్టర్ రామస్వామి, మచ్చ యాదగిరి, శివ కృష్ణ గౌడ్, పెద్దిగారి నగేష్, నవీన్, చందు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రాక్టర్ బోల్తా పడి బాలుడు మృతి

- ట్రాక్టర్ యజమాని యనమోని కృష్ణపై కేసు నమోదు
- తల్పునూర్‌లో విషాదం



**రేవల్లి, ఆగస్టు 23 (జనంసాక్షి):** రేవల్లి మండలంలోని తల్పునూర్ గ్రామంలో విషాద ఘటన చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై రజిత తెలిపిన వివరాల మేరకు తల్పునూర్ గ్రామానికి చెందిన యానమోని కృష్ణ శనివారం తేదీ 22.08.2026 రోజు సాయంత్రం సుమారు 04 గంటలకు అదే గ్రామానికి చెందిన ఎండి. షబ్బీర్ పొలంలో పనులు ముగించుకొని తిరిగి ఇంటికి వస్తుండగా తన ట్రాక్టర్ పై అదే గ్రామానికి చెందిన కావలి సాయికుమార్ (వయసు 16 సం) ను ఇంజిన్ పై ఎక్కించుకొని ట్రాక్టర్ నడుపుతుండగా అదుపు తప్పి పొలంలోనే బోర్లా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ కింద, పొలంలోని బురదలో ఇరుక్కొని సాయికుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు.

సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఒక గాను ఒక కొడుకు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. సాయికుమార్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడి తల్లి నీలమ్మ ఫిర్యాదు మేరకు యనమోని కృష్ణపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని రేవల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం పంచనామా నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు రేవల్లి మండల ఎస్సై రజిత తెలిపారు.

## మిషన్ భగీరథ పనుల్లో
# విరిగిన కాలువ.. ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని వైనం

- గ్రామసభల్లో ప్రస్తావించినా పట్టించుకోని అధికారులు.. వర్షాలకు రోడ్లపై నీరు



**కోహిర్, ఆగస్టు 23 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలం పైడిగుమ్మల్ గ్రామంలోని 8వ వార్డులో కాలువ దుస్థితి అధ్వానంగా మారింది. మిషన్ భగీరథ పనుల సమయంలో పైపుల కోసం తవ్వకాలు చేపట్టగా వాహనం ఢీకొని కాలువ దెబ్బతిన్నదని స్థానికులు చెబుతున్నారు. అప్పటి నుంచి ఏళ్లు గడుస్తున్నా శాశ్వత మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కాలువ విరిగిపోవడంతో వర్షాలు కురిసిన సమయంలో నీరు సక్రమంగా ప్రవహించక రోడ్డుపైనే నిలిచిపోతోందని స్థానికులు వాపోతున్నారు. కాలువలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో దుర్వాసనతో పాటు పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. కాలువ సమస్యను పలుమార్లు ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు గ్రామసభల్లోనూ ప్రస్తావించినప్పటికీ ఇప్పటివరకు పరిష్కారం లభించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు వెంటనే కాలువను పరిశీలించి అవసరమైన నిధులు కేటాయించి మరమ్మతులు చేపట్టాలని 8వ వార్డు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# వైభవంగా శ్రీ చౌడమ్మ తల్లి బోనాల మహోత్సవం

**జడ్చర్ల, ఆగస్టు 23 (జనంసాక్షి):** మున్సిపాలిటీ పరిధిలోని కావేరమ్మపేటలో శ్రీ చౌడమ్మ తల్లి బోనాల పండుగ ఆదివారం వైభవంగా, ఆధ్యాత్మిక శోభతో జరిగింది. కావేరమ్మపేట యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కావేరమ్మపేట నుంచి చౌడమ్మ గుట్ట వరకు మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలను నెత్తిన పెట్టుకొని భారీ ర్యాలీగా తరలివెళ్లారు. డోలు చప్పుళ్ల హోరు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాల మధ్య ఊరేగింపు అత్యంత కోలాహలంగా సాగింది. పోతురాజుల విన్యాసాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చౌడమ్మ గుట్టకు చేరుకున్న భక్తులు శ్రీ చౌడమ్మ తల్లికి బోనాలు, నైవేద్యాలు సమర్పించారు. నియోజకవర్గ ప్రజలంతా చల్లగా ఉండాలని, గ్రామానికి సకల శుభాలు కలగాలని కోరుకుంటూ భక్తులు అమ్మవారికి గొర్రె పొట్టేళ్లను సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు, యాదవ సోదరులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాల మహోత్సవాన్ని విజయవంతం చేశారు.

# శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ





**కోహెడ, ఆగస్టు 23(జనంసాక్షి):** మండలంలోని శ్రీరాములపల్లి గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు ప్రసాదరావు శర్మ, విద్యాధర శర్మ ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు. గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన శ్రీ ఆంజనేయ స్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి, భక్తులకు సౌకర్యవంతంగా తీర్చిదిద్దే ఉద్దేశంతో పునర్నిర్మాణ పనులు చేపట్టడం జరుగుతోంది. ఈ సందర్భంగా ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ ప్రజలు, భక్తులు, దాతలు, పెద్ద లు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆలయ పునర్నిర్మాణం గ్రామ ప్రజలందరి సహకారంతో విజయవంతంగా పూర్తవుతుందని, భవిష్యత్ తరాలకు కూడా ఆధ్యాత్మిక కేంద్రంగా నిలిచేలా ఆలయాన్ని అభివృద్ధి చేయాలని కార్యక్రమంలో పాల్గొన్న వారు ఆకాంక్షించారు. ఆలయ నిర్మాణానికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పోలు శ్రీనివాస్, వైస్ చైర్మన్ ఎసిరెడ్డి సుధాకర్ రెడ్డి,సెక్రటరీ జాలిగం రమేష్, ట్రెజరర్ జాగిరి పర్శరాములు గౌడ్, ఆలయ పూజారు లు వేముల వీరస్వామి, సకినాల రాజు,కమిటీ సభ్యులు, ప్రజా ప్రతి నిధులు, మహిళలు, యువకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అర్హులైన వయోవృద్ధులకు
# చేయూత పింఛన్లు ఇవ్వాల్సిందే

- మండల భాజపా అధ్యక్షుడు గంగ్వార్ మల్లేష్



**న్యాల్‌కల్, ఆగస్టు 23(జనంసాక్షి):** ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం మండలంలో అర్హులైన వయోవృద్ధులకు "చేయూత పెన్షన్ల"లను ఇవ్వాల్సిందేనని మండల భాజపా అధ్యక్షుడు గంగువార్ మల్లేష్ ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగానికి డిమాండ్ చేశారు. ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన వయోవృద్ధులకు ఆదుకునేందుకు సామాజిక భద్రత, బాధ్యతగా భావించి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు. గతంలో దరఖాస్తు చేసుకున్న పత్రాలను పరిశీలించి అర్హులను గుర్తించాలని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి "చేయూత పెన్షన్లు" అందజేసి ఆదుకోవాలని సూచించారు. వయోవృద్ధులకు జీవనాధారంగా ఆదుకునే పెన్షన్లను అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# సిపిఎస్ రద్దుచేసి ఓపిఎస్ అమలు చేయాలి

- ఈహెచ్ఎస్ మార్గదర్శకాల్లో లోపాలను సవరించాలి
- తపస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దత్తాత్రి, సధాకర్




**సంగారెడ్డి, ఆగస్టు 23(జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన ప్రకారం సిపిఎస్ రద్దుచేసి వెంటనే ఓపిఎస్ అమలు చేయాలని తపస్ సంగారెడ్డి జిల్లా శాఖ అధ్యక్షులు దత్తాత్రి, ప్రధాన కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని, జీఓ 317 బాధితులందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏ, జీపీఎఫ్ నిధులను వెంటనే విడుదల చేసి, పీఆర్సీని ప్రకటించి అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ప్రభుత్వం విడుదల చేసిన నూతన ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఎన్ ఈ హెచ్ ఎస్) మార్గదర్శకాల్లోని లోపాలను సవరించాలని ఈ హెచ్ ఎస్ ద్వారా ఓపీ చికిత్సను కేవలం వెల్‌నెస్ సెంటర్లకే పరిమితం చేయడం సరికాదన్నారు. కార్పొరేట్, ప్రైవేట్ ఆసుపత్రుల్లోనూ ఓపీ సేవలు పొందే అవకాశం కల్పించేలా నిబంధనలను మార్చాలని కోరారు.

కార్యక్రమంలో తపస్ జిల్లా కార్యదర్శి తుకారం, జిల్లా బాధ్యులు చంద్రశేఖర్, సంజీవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామ ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న సర్పంచ్.. ప్రసాద్ గౌడ్



**వెల్దండ, ఆగస్టు 23 (జనంసాక్షి):** వెల్దండ మండలం బొల్లంపల్లి చౌరస్తాలో నూతనంగా ఏర్పాటుచేసిన శ్రీరామ ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవానికి బొల్లంపల్లి గ్రామ సర్పంచ్ సత్తూరి ప్రసాద్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఫంక్షన్ హాల్ నిర్వాహకులైన ఆలంపల్లి కృష్ణ, కానుగుల కానుగుల రమేష్, ఎండి రాజ్ మహమ్మద్, మండలి శ్రీనివాస్ యాదవులను శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలలో ఇలాంటి వసతులు ఉండడం సామాజిక కార్యక్రమాలకు ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ చల్లా వెంకటరెడ్డి, మార్కెట్ డైరెక్టర్ యాదయ్య, నాయకులు బ్రహ్మచారి, అంజయ్య, శ్రీనివాస్ చారి, కొమ్ము రవి, మోతే నాయక్, లాలు నాయక్, ఉప్పు వెంకటరావు, భూతరాజు శ్రీను, సిలికేశ్వరం శ్యామ్, కానుగుల వెంకటయ్య, అనంత గౌడ్, బండ్ల రాములు, కొర్ర శివ నాయక్, పలువురు స్థానిక నాయకులు ప్రజాప్రతినిధులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## శ్రీ ముత్యాల పోచమ్మ విగ్రహ ప్రతిష్ట

- బీరప్ప బోనాల మహోత్సవంలో పాల్గొన్న వంగ రాజేశ్వర్ రెడ్డి



**నంగునూరు, ఆగస్టు 23 (జనంసాక్షి):** శ్రీ పోచమ్మ తల్లి ఆశీస్సులతో సిద్దిపేట నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఆనందంగా జీవించాలని వంగ రాజేశ్వర్ రెడ్డి ఆకాంక్షించారు. నంగునూర్ మండలం మగ్దంపూర్‌లో నిర్వహించిన శ్రీ బీరప్ప బోనాల పండుగ శ్రీ ముత్యాల పోచమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో వంగ రాజేశ్వర్ రెడ్డి పాల్గొని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల పండుగ సందర్భంగా గ్రామంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించిన కార్యక్రమంలో కురుమ సంఘం సభ్యులు, గ్రామ ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## విద్యుత్ ప్రమాదానికి గురైన వ్యక్తికి ఎమ్మార్పీఎస్ నాయకుల పరామర్శ



**వెల్దండ, ఆగస్టు 23(జనంసాక్షి):** నాగర్‌కర్నూలు జిల్లా వెల్దండ మండలం చెదురుపల్లి గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికులు పోలె శ్రీరాములు విధులు నిర్వహిస్తూ ఇటీవల ప్రమాదవశాత్తు విద్యుత్ ప్రమాదానికి గురయ్యారు. వెల్దండ మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న నాగర్‌కర్నూల్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు యాదగిరి మాదిగ, కల్వకుర్తి నియోజకవర్గం ఇంచార్జ్ తాంద్రబాలు, నియోజకవర్గం అధ్యక్షులు రామాంజనేయులు, తాలూకా ఉపాధ్యక్షులు దూళ్ల రామస్వామి, ప్రధాన కార్యదర్శి జంగయ్యలు ఆదివారం ప్రమాద బాధితుని పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి వైద్యులకు సూచించారు.బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

## శ్రీ కేతఖీ సంగమేశ్వరుడి
# దర్శనార్థం పాదయాత్రగా భక్తజనం

- 20 సంవత్సరాలుగా కొనసాగుతున్న భక్తుల పాదయాత్ర
- మహారాష్ట్ర, కర్ణాటక భక్తులకు అత్నూర్ గ్రామస్తుల ఘన స్వాగతం





**న్యాల్‌కల్, ఆగస్టు 23 (జనంసాక్షి):** దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన శ్రీ కేతఖీ సంగమేశ్వరున్ని దర్శించుకునేందుకు భక్తులు పాదయాత్రగా తరలివచ్చారు. అత్యంత పవిత్రమైన శ్రావణమాసంలో సంగమేశ్వరున్ని దర్శించుకునేందుకు మహారాష్ట్ర, కర్ణాటక (హాణేగావ్, నిట్టూర్) ప్రాంతాలకు చెందిన వందలాది భక్తజనం గత 20 సంవత్సరాలుగా పాదయాత్రగా తరలివస్తుంటారు. సోమవారం తెల్లవారు జామున్నె ఝరాసంగంలోని శ్రీ కేతఖీ సంగమేశ్వరున్ని దర్శించుకునేందుకు భక్తులు బీదర్, మండలంలోని డప్పూర్, ఆత్నూర్, న్యాల్ కల్, ముంగి గ్రామాల మీదుగా ఆదివారం ఉదయం పాదయాత్రగా బయలుదేరారు. 20 సంవత్సరాలుగా మండలంలోని అత్నూర్ గ్రామానికి చెందిన కీ,శే : తుకారం పాటిల్, వారి కుటుంబ సభ్యులైన ప్యరాక్ బాయి, మారుతి, ఏక్నాథ్, నర్సింగ్ ల ఆధ్వర్యంలో పాదయాత్రగా తరలివచ్చిన భక్తజనానికి ఘన స్వాగతం పలికారు. వ్యవసాయ పొలంవద్ద అల్పాహారం, భోజన సౌకర్యం, తేనీరు, తదితర సౌకర్యాలను సమకూర్చారు. అనంతరం సాయంత్రం అత్నూర్, న్యాల్‌కల్, ముంగి గ్రామాల మీదుగా భక్తుల పాదయాత్ర కొనసాగింది. కుటుంబ సభ్యులతో పాటు గ్రామానికి చెందిన భక్తులు, యువభక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సేవా కార్యక్రమాలను చేపట్టారు.

## ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభోత్సవం

- పేదల సొంతింటి కల సాకారం



**గుండుమాల్ ఆగస్టు 23(జనంసాక్షి):** పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా నిర్మించిన ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం గుండుమాల్ మండలంలోని ముదిరెడ్డిపల్లిలో గొల్ల లక్ష్మీ కేశవులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, గ్రామ సర్పంచ్ బందేరి దేవమ్మ కృష్ణయ్య పాల్గొని నూతన గృహాలను ప్రారంభించి లబ్ధిదారులకు ఇంటి తాళాలను అందజేసి అభినందనలు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయంతో పేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరుతోందని వారు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేసి అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ఇల్లు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బ్యాగరి సత్యమ్మ, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## భక్తిగానమే బాటగా..

- బెంగాల్‌లో కొంకల బిడ్డ ప్రతిభ



**గద్వాల, ఆగస్టు 23 (జనంసాక్షి):**
భక్తి గానంతో రాష్ట్ర సరిహద్దులు దాటి కొంకల గ్రామానికి చెందిన కురువ అక్బర్ బాబు ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని కాలింగ్‌పాంగ్‌లో నిర్వహించిన సాయి భజన్ కార్యక్రమంలో ప్రముఖ గాయకులతో కలిసి పాల్గొని తన గాన ప్రతిభను చాటుకున్నారు.కర్నూలుకు చెందిన శ్రీ శివ పంచాక్షరి భజన బృందం ఆధ్వర్యంలో గణేష్ మాస్టర్ నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఇందులో అక్బర్‌బాబు పాల్గొని భక్తి గీతాలు ఆలపించారు. ప్రముఖ గాయకుల మధ్య,సుదూర ప్రాంతంలోని వేదికపై భజన కార్యక్రమంలో పాల్గొనే అవకాశం లభించడం ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. తనకు ఈ అవకాశం రావడానికి మాతాపితరుల ఆశీస్సులతో పాటు కొంకల గ్రామ ప్రజల దీవెనలు ఎంతో తోడ్పడ్డాయని అక్బర్ బాబు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన కళాకారుడు రాష్ట్రం దాటి తన ప్రతిభను చాటుకోవడం గర్వకారణమని గ్రామ పెద్దలు అన్నారు. వివిధ ప్రాంతాలకు భజన బృందాలతో వెళ్లి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటూ కొంకల గ్రామానికి మంచి పేరు తీసుకువస్తున్న అక్బర్ బాబును గ్రామస్తులు అభినందించారు.

## మృతుని కుటుంబానికి కాంగ్రెస్ కౌన్సిలర్ సాయం



**చేర్యాల, ఆగస్టు 23(జనంసాక్షి):** చేర్యాల మున్సిపల్ పట్టణ పరిధిలోని 12వ వార్డుకు చెందిన మాచర్ల మహేష్ ఇటీవల మరణించగా వారి కుటుంబాన్ని స్థానిక కౌన్సిలర్ మహమ్మద్ షరీఫా బేగం ఖాజా ఆదివారం పరామర్శించారు. ఆ నిరుపేద కుటుంబానికి తనవంతు సహాయంగా 50 కిలోల బియ్యం, ఇతర సరుకులు అందజేశారు. ప్రజా ప్రభుత్వంలో ఆ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేసి ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో చేర్యాల మాజీ జెడ్పిటిసి కొమ్ము నర్సింగరావు, చేర్యాల మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కాటం మల్లేశం, బుట్టి యాదగిరి, పచ్చిమడ్ల వెంకటయ్య గౌడ్, మాచర్ల వెంకట్, అంబటి అంజయ్య గౌడ్, తుమ్మలపల్లి సంతోష్, మాచర్ల అంజయ్య, బాబు, తదితరులు ఉన్నారు.

## పాత ఇనుప స్తంభాలను తీసి కొత్త స్తంభాలు ఏర్పాటు

- మున్సిపల్ చైర్మన్ జింక సువర్ణ



**అమరచింత, ఆగస్టు 23 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ, పాడి పరిశ్రమ అభివృద్ధి , మత్స్య, క్రీడలు మరియు యువజన శాఖ మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి. ఆదేశానుసారంగా రాష్ట్ర టాడీ టాపర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ సూచనల మేరకు. అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలోని 2వార్డ్ 3వ వార్డ లో పర్యటిం చడం జరిగింది. చైర్మన్ జింక సువర్ణ మాట్లాడుతూ ప్రజలు సమస్య లను పరిష్కరించే విధంగా వార్డుల అభివృద్ధి కోసం మున్సిపాలిటీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తాను. అని అన్నారు. విద్యుత్ అధికారులతో మాట్లాడి పాత స్తంభాలను తీసి వేసి కొత్త స్తంభాలును ఏర్పాటు చేస్తాం. వార్డు ప్రజలకు విద్యుత్ షాక్ గురి కాకుండా వచ్చే ప్రమాదం ఉంటుందని గ్రహించి పరిష్కారం చేస్తున్నాం. ఎన్నో సంవత్సరాల నుండి వైర్లు కిందికున్న ఎవరు పట్టించుకున్న నాధుడు లేక పోలేదు ప్రజల ఇబ్బందులను తెలుసుకొని కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు టి రవికాంత్ .రవి యాదవ్ . వార్డు కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీరామ ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవానికి హాజరైన సుంకి రెడ్డి



**వెల్దండ, ఆగస్టు 23 (జనంసాక్షి):**
వెల్దండ మండల పరిధిలోని బొల్లంపల్లి చౌరస్తా రోడ్డులో నూతనంగా నిర్మించిన శ్రీరామ ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫంక్షన్ హాల్ నిర్వాహకులు ఆలంపల్లి కృష్ణ, మండలి శ్రీనివాస్ యాదవ్, కానుగుల రమేష్,ఎండి రాజ్ మహ్మద్ లకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉండేలా ఇలాంటి సౌకర్యాలు ఏర్పాటవడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రామకృష్ణ,స్థానిక నాయకులు వెంకట్రావ్‌లతో పాటు ఫౌండేషన్ సభ్యులు కొండల్ యాదవ్,శ్రీరాములు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికుడు శ్రీరామ్‌కు అండగా నిలిచిన చెదురుపల్లి గ్రామస్తులు



**వెల్దండ, ఆగస్టు 23 (జనంసాక్షి):**
నాగర్ కర్నూలు జిల్లా వెల్దండ మండలం, చెదురుపల్లి గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికుడు పోలే శ్రీరామ్ విధులు నిర్వహిస్తూ ఇటీవల విద్యుత్ షాక్‌కు గురయ్యారు. కుటుంబ సభ్యులు గ్రామస్తులు వెంటనే ఆయనను కల్వకుర్తిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పొందుపరిచి చికిత్స అందిస్తున్నారు. కుటుంబ యజమాని ఆర్థిక ఇబ్బందులలో ఉన్న కుటుంబానికి చెదురుపల్లి గ్రామస్తులు తక్షణ ఆసుపత్రి ఖర్చులకు గాను రూ. 31 వేల రూపాయలు అతని భార్య జయమ్మకు అందజేశారు. ఆపత్కాలంలో అండగా నిలిచి ఉదారత చాటుకున్న గ్రామస్తులను పలువురు అభినందిస్తున్నారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ధన్సింగ్ నాయక్, ఉప సర్పంచ్ మెరుగు సహదేవ్, తిరుపతయ్య గౌడ్,మరియు వార్డు సభ్యులు నిత్యం గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటున్న యువ నాయకులు పోలే అశోక్,లక్ష్మణ్, పోలే తిరుపతిలతో పాటు యువకులు, మహిళలు పాల్గొన్నారు.

## ఇద్దరు దొంగల అరెస్ట్ రిమాండ్‌కు తరలింపు



**కోహెడ, ఆగస్టు 23(జనంసాక్షి):** వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరి నిందితులను పట్టుకుని రిమాండ్‌కు తరలించిన కోహెడ పోలీసులు గత నెల రోజుల నుండి వరుస దొంగతనాలకు పాల్పడుతున్న కోహెడ మండల కేంద్రానికి చెందిన పెసరు పర్షరాములు, వెంకటేశ్వరపల్లికి చెందిన రేగుల శ్రీనివాస్ లు కలిసి గుండా రెడ్డి పల్లి, బస్వాపూర్, కోహెడ గ్రామాల్లో రాత్రి సమయంలో ఇంటి తాళాలు పగుల గొట్టి బంగారం వెండి వస్తువులు, నగదు దొంగిలించినారని, వారిని శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ధర్మసాగర్ పల్లి రోడ్డుకు కోహెడ చెరువు కట్ట వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా పట్టుకున్నారని వారి వద్ద నుండి 2 సెల్ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. కేసు చేదనలో ప్రతిభ కనబర్చిన కోహెడ యస్.ఐ. పుల్ల అభిలాష్ , హెడ్ కానిస్టేబుల్ సంపత్, కానిస్టేబుల్ లు రవి నాయక్, జీవన్ లను హుస్నాబాద్ సి.ఐ. అభినందించారు.

## ఆగస్టు 31న నాగర్‌కర్నూల్ జిల్లా సదస్సు విజయవంతం చేయండి



**వెల్దండ, ఆగస్టు 23(జనంసాక్షి):**
జాతీయ అధ్యక్షులు మేడి పాపన్న ,రాష్ట్ర అధ్యక్షులు కేదాస్ మోహన్‌ల ఆదేశాల మేరకు నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం అధ్యక్షులు పకాడి రామాంజనేయులు, నియోజకవర్గ ఇన్చార్జి తాండ్ర బాలు మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు యాదగిరి మాదిగ ఆధ్వర్యంలో కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ తుంగలో తొక్కిందని డాక్టర్ అంబేద్కర్ అభయస్తం పథకం ద్వారా దళితులకు 12 లక్షల రూపాయలు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. దాన్ని వెంటనే అమలు చేయాలని అన్నారు పరిశుద్ధ కార్మికులకు నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం వేతనం 25 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు యాదగిరి మాదిగ జిల్లా నాయకులు కాశిపాకుల రవికుమార్ కంబాలపల్లి కుమార్ వసంత కుమార్ చింటూ కృష్ణ ప్రసాద్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటోల బందును జయప్రదం చేయాలి

ఆగస్టు 24న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ఆటోల బందును విజయవంతం చేయాలని, అదే రోజు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించే నిరసన కార్యక్రమానికి రవాణా రంగ కార్మికులు, ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో హాజరై తమ ఐక్యతను చాటాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బాలస్వామి, శివయ్య, అంజి, నరసింహ, సుల్తాన్, లక్ష్మయ్య, శేషు, సురేందర్, గోపాల్, ప్రభాకర్, శేఖర్, రాముడు, మల్లీ, నయూం, యాదయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి దయతో సమృద్ధిగా వర్షాలు కురవాలి

- నంగునూరు ఏఎంసి చైర్మన్ దేవులపల్లి యాదగిరి



**నంగునూరు, ఆగస్టు 23(జనంసాక్షి):** అమ్మవారి దయతో రైతుల సంక్షేమం, రాష్ట్ర వ్యవసాయ రంగం అభివృద్ధి కోసం సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు పుష్కలంగా పండాలని నంగునూరు మండల మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి ఆకాంక్షించారు. ఆదివారం నంగునూరు మండలం మగ్దుంపూర్ గ్రామంలో గ్రామస్తులు నూతనంగా నిర్మించిన ముత్యాల నల్ల పోచమ్మ దేవాలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసం సమృద్ధిగా వర్షాలు కురవాలని, చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు నిండి సాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ముత్యాల నల్ల పోచమ్మ తల్లిని ప్రార్థించినట్లు తెలిపారు. తెలంగాణలో ప్రతి రైతు కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాకాల శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అచ్చిన సత్తయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎనగందుల యాదగిరి, రాగుల కనకయ్య, పాలేపు నర్సిములు,భాస్వరాజు రాములు, పాకాల భాస్కర్, కూసుంభ రాజేశం,జెల్ల పోచయ్య, జాప యాదగిరి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# అనాధ వికలాంగుడికి అండగా నిలిచిన “వరగంటి”

- ధూల్మిట్టలో పాన్ షాప్ ఏర్పాటు





**చేర్యాల/ధూల్మిట్ట, ఆగస్టు 23(జనంసాక్షి):** అమ్మ నాన్న లేరు.. తినడానికి తిండి లేదు.. నడుద్దామంటే కాళ్లు చచ్చుబడి పోయాయి. ఆదుకునేవారు ఎవరూ లేక అనాధగా మిగిలిపోయి దుర్భర జీవనం సాగిస్తున్న దూల్మిట్ట మండల కేంద్రానికి చెందిన తమ్మడి రాజు అనే వికలాంగుడి దీన పరిస్థితిని తెలుసుకున్న వికలాంగుల సంఘం (ఎన్.పీ.ఆర్.డీ) డివిజన్ అధ్యక్షుడు తుమ్మలపల్లి అనిల్ కుమార్ వెంటనే చేర్యాల ప్రముఖ వ్యాపార వేత్త వరగంటి శ్రీకాంత్ దృష్టికి తీసుకెళ్లగా తన స్వంత డబ్బులతో పాన్ డబ్బాను ఏర్పాటు చేయించి ఆదివారం ధూల్మిట్ట మండల కేంద్రంలో షాపు ను స్థానిక సర్పంచ్ గునుకుల లీల జగన్ మోహన్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు. వికలాంగుడి దీన పరిస్థితిపై స్పందించి ఉపాధి కల్పించడానికి షాపు ఏర్పాటు చేసిన శ్రీకాంత్ ను గ్రామస్తులు అభినందించారు. అనంతరం షాప్ సరుకుల కోసం సర్పంచ్ రూ. 5 వేల సాయం అందజేశారు. లింగపూర్ గ్రామానికి చెందిన రమేష్, మేకల విజయ్ కలిసి ఐదు వేల విలువ చేసే దుకాణానికి సరిపడే పాన్ సరుకులు అందించారు. అనంతరం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక చేర్యాల డివిజన్ తరపున ఫ్యాన్ బహుకరించి సరుకులు అందజేశారు. కార్యక్రమంలో వికలాంగుల సంఘం డివిజన్ ఉపాధ్యక్షుడు తాండ్ర సత్తయ్య, సహాయ కార్యదర్శి పర్వతం మల్లయ్య, సంఘం సభ్యులు కర్రె రవి, తుమ్మలపల్లి అనిల్, ధూల్మిట్ట గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## వివాహ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

**ఉప్పునుంతల, (జనంసాక్షి):** ఉప్పునుంతల మండలం రాయిచేడ్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు గొడుగు వెంకటయ్య కుమారుడు గొడుగు చంద్రమౌళి వివాహ వేడుకలో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు వారితోపాటు స్థానిక నాయకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారుద.

## రక్తదానం మహాదానం...

- బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం






**సదాశివపేట, ఆగస్టు 23 (జనంసాక్షి):**
విశ్వబంధుత్వ దినోత్సవం, దాదీ ప్రకాశమణి స్మృతి దినోత్సవాన్ని పురస్కరించుకుని సదాశివపేట గురునగర్ కాలనీలోని ఓంశాంతి కేంద్రం లో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో మహా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో బ్రహ్మకుమారీస్ సభ్యులతో పాటు పీఎంఆర్ యువసేన నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు.

రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని, ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంచుకుని ముందుకు రావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పీఎంఆర్ యువసేన నాయకుడు రాగం అనిల్ 10వ సారి రక్తదానం చేయడం జరిగింది. ఆయనకు బ్రహ్మకుమారీస్ అక్కయ్య చేతులమీదుగా సర్టిఫికెట్ అందజేసి అభినందించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు తుమ్మలపల్లి పృథ్వీరాజ్, గందిగె రాజు, రవికుమార్, మహేష్ స్వామి, గంట శివన్న, బీకే అన్నపూర్ణ, రాధిక, రాజవర్ధన్, నర్సింహులు, జగన్, స్వప్న, పద్మ, చాముండేశ్వరి, జయలక్ష్మి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం



**అమీన్పూర్, ఆగస్టు 23 (జనంసాక్షి):** మండల పరిధిలోని పటేల్ గూడా సిద్ధార్థ కాలనీలో ఆదివారం శ్రీ కట్ట మైసమ్మ ఆలయ మొదటి వార్షికోత్సవం భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలనీవాసులు చిన్న పెద్దలు అందరూ ఆలయంలో ప్రత్యేక పూజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా భాజపా మండల పార్టీ అధ్యక్షుడు ఈర్ల రాజు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ సనాతన ధర్మంలో దైవభక్తికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. ప్రతిఒక్కరూ దైవభక్తిని పెంపొందించుకొని సమాజ శ్రేయస్సు కోసం పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కాలనీవాసులు పాల్గొన్నారు.

# విభిన్న సంస్కృతులకు నిలయం పటాన్‌చెరు ఏంఎల్‌ఏ

- ఆర్‌సీ పురంలో ఘనంగా ఓనం వేడుకలు

**రామచంద్రాపురం, ఆగస్టు 23(జనంసాక్షి):**
పటాన్చెరు నియోజకవర్గం విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలకు నిలయంగా ఉందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. రామచంద్రాపురం డివిజన్‌లోని ఎస్ఎన్ గార్డెన్స్‌లో కేరళ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఓనం వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పటాన్చెరు నియోజకవర్గం మినీ ఇండియాగా పేరొందిందని, అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాల పండుగలు, సంప్రదాయాలను గౌరవిస్తూ వేడుకలు నిర్వహిస్తు




న్నామని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కో-ఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు అంజయ్య, మెట్టు కుమార్‌యాదవ్, పరమేశ్‌యాద వ్, విశాల్ తదితరులతో పాటు కేరళ సంఘం సభ్యులు





పాల్గొన్నారు.

# వైభవంగా ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు

- 27 నుంచి 30 వరకు గువ్వలోనిపల్లిలో ఆధ్యాత్మిక సందడి
- సర్పంచ్ పానుగంటి శ్రీదేవి

**ఉప్పునుంతల, (జనంసాక్షి):** ఉప్పునుంతల మండలంలోని గువ్వలోనిపల్లి గ్రామంలో ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు శ్రీ సీతారామచంద్రస్వామి, శ్రీ ఉమామహేశ్వరస్వామి, శ్రీ గణపతి స్వామి, శ్రీ హనుమాన్ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ పానుగంటి శ్రీదేవి, ఆలయ కమిటీ సభ్యులు, ఉత్సవ నిర్వాహకులు తెలిపారు.

నాలుగు రోజుల పాటు నిర్వహించే మహోత్సవాల్లో భాగంగా 27న గణపతి పూజ, పుణ్యాహవాచనం, మండపారాధన, అంకురార్పణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ శ్రీదేవి తెలిపారు. 28న ధ్వజారోహణ, జలాధివాసం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 29న ప్రత్యేక పూజలు, అభిషేకాలతో పాటు శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

30న ధ్వజస్తంభ ప్రతిష్ఠతో పాటు శ్రీ సీతారామచంద్రస్వామి, శ్రీ ఉమా మహేశ్వరస్వామి, శ్రీ గణపతి, శ్రీ హనుమాన్ స్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అనంతరం చిరుతల రామాయణం, చిరుతల భజన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

**ప్రముఖుల హాజరు...**

ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలకు నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ, మాజీ ఎంపీ పోతుగంటి రాములు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి









తదితర ప్రముఖులు హాజరుకానున్నట్లు ఆలయ కమిటీ, నిర్వాహకులు తెలిపారు.

**భక్తులకు అన్ని ఏర్పాట్లు...**

మహోత్సవాలను పురస్కరించుకుని గ్రామంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు సర్పంచ్ పానుగంటి శ్రీదేవి తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని, ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆమె కోరారు.

## సేవలో శతకం.. 100 వారాలు పూర్తి చేసుకున్న జె.కె. ట్రస్ట్

**నవాబుపేట, ఆగస్టు 23(జనంసాక్షి):** ఆకలితో ఉన్న పేదవాడి కడుపు నింపడమే పరమావధిగా భావించి, నిరంతరాయంగా సేవాలక్ష్మిని చాటుతున్న జె.కె. ట్రస్ట్ (JK Trust) మరో అరుదైన మైలురాయిని అధిగమించింది. ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం




నిర్వహిస్తున్న ఉచిత భోజన వితరణ కార్యక్రమం నేటితో విజయవంతంగా 100 వారాలు పూర్తి చేసుకుంది. 8 సెప్టెంబర్ 2024 న ప్రారంభమైన ఈ మహా యజ్ఞం, నేడు 23 ఆగస్టు 2026 నాటికి వంద వారాల సుదీర్ఘ సేవా ప్రస్థానాన్ని ముగించుకుని ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకుంది.

నవాబుపేట మండల కేంద్రంలో ప్రతి ఆదివారం వారపు సంత జరుగుతుంది. ఈ సంతకు చుట్టుపక్కల గ్రామాల నుండి వచ్చే వందలాది మంది పేద ప్రజలు, బాటసారుల ఆకలి తీర్చడమే లక్ష్యంగా జె.కె. ట్రస్ట్ కుటుంబ సభ్యులంతా కలిసి ఈ అన్నదానాన్ని బాధ్యతగా నిర్వహిస్తున్నారు. ప్రతి ఆదివారం ఇక్కడికి వచ్చేవారు కడుపునిండా భోజనం చేసి, తృప్తిగా ఆశీర్వదించి వెళ్తున్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ, సమాజ శ్రేయస్సు కోసం పాటుపడటమే ధ్యేయంగా ఈ కుటుంబం ముందుకు సాగుతోంది.నవాబుపేట సర్పంచ్ గీతారాణి గారు జె.కె. ట్రస్ట్‌లో చురుకైన సభ్యురాలిగా ఉంటూ, నిత్యం ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ఎన్నో సేవా కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నారు. ఈ సందర్భంగా జె.కె. ట్రస్ట్ డైరెక్టర్ వి. సుధాకర్ ఆచారి మరియు వి. నరసింహ చారి మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో కూడా జె.కె. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇలాంటి మరెన్నో సామాజిక, సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు. స్వార్థం లేని సమాజం కోసం, పేదల ఆకలి తీర్చడం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న జె.కె. ట్రస్ట్ కుటుంబ సభ్యుల సేవలను మండల ప్రజలు మరియు లబ్ధిదారులు వేనోళ్ల కొనియాడుతున్నారు.

## కంసానిపల్లిలో ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీ ఏర్పాటు



**ఉప్పునుంతల, (జనంసాక్షి):** ఉప్పునుంతల మండల పరిధిలోని కంసానిపల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీని ఆదివారం ఏర్పాటు చేశారు. జిల్లా అధికార ప్రతినిధి, మండల ఇన్‌చార్జి ఎడెల్లి ఆంజనేయులు మాదిగ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మద్దిలేటి మాదిగ, జిల్లా అధ్యక్షుడు గుడియానిపల్లి రాజు మాదిగ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలోని మాదిగల సమస్యలు, హక్కులు, సామాజిక చైతన్యం తదితర అంశాలపై నాయకులు చర్చించారు. అలాగే ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని వివరించారు.

అనంతరం నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఉల్పర పర్వతాలు, అధికార ప్రతినిధిగా ఎల్లపకుల గోపాల్, ప్రధాన కార్యదర్శిగా ప్రశాంత్‌ను ఎన్నుకున్నారు.

నూతనంగా ఎన్నికైన కమిటీ బాధ్యులు ఎమ్మార్పీఎస్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ మాదిగల హక్కుల సాధన కోసం ఐక్యంగా ముందుకు సాగాలని నాయకులు పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసి హక్కుల సాధనకు కృషి చేయాలని సూచించారు.



## ఆహారం అందించి.. ఆప్యాయంగా పలకరించి..

**ముషీరాబాద్ (జనంసాక్షి) :** ఆకలితో అలమటిస్తున్న నిరుపేదలకు ఒక్కపూటైనా ఆహారం అందించాలనే లక్ష్యంతో సాగుతోంది స్కై ఫౌండేషన్. హైదరాబాద్ నగరంలో రోడ్ల పక్కన, ఫుట్‌పాత్‌లపై జీవనం సాగిస్తున్న అనాథలు, సంచార జాతుల కుటుంబాలు, నిరాశ్రయులను గుర్తించి స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో 307వ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ. పావని, సభ్యులు కుషాల్, రణధీర్ గౌడ్ పాల్గొన్నారు.



# బీఆర్ఎస్ నాయకులదే కుట్ర

## అసత్య ఆరోపణలను తిప్పికొట్టిన కందనెల్లి తండా సర్పంచ్ ఆనంద్ నాయక్



**పెద్దేముల్, ఆగస్టు 23 (జనంసాక్షి):** తమంటే గిట్టని కొంతమంది బీఆర్ఎస్ నాయకులు తమపై అసత్య ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారని కందనెల్లి తండా సర్పంచ్ రాథోడ్ ఆనంద్ నాయక్ ఆరోపించారు. శనివారం పెద్దేముల్ మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో విలేకరుల సమావేశమే ఏర్పాటు చేశారు. సందర్భంగా సర్పంచ్ ఆనంద్ నాయక్ మాట్లాడుతూ.. గత 8 నెలల క్రితం జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో నాపై పోటీ చేసి ఓటమి చెందిన జై సింగ్, రవి,రాందాస్, రాంశెట్టి తదితరులు ఆ ఓటమిని ఇంకా జీర్ణించుకోలేక పోతున్నారు.అదే అదునుగా చూసుకుని తప్పుడు ఆరోపణలకు గ్రామంలో అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారఅని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఏఅభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు.కందనెల్లి తండాలో ప్రజలు నీటి ఇబ్బందులు పడకూడదని ఉద్దేశ్యంతో సొంత డబ్బులతో బోరు మోటార్ వేయించానని తెలిపారు. గ్రామ సంక్షేమానికి పాటుపడుతున్న నాపై నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదు.తండాలో నా ఎదుగుదలను చూసి ఓర్వలేకనే రాజకీయ ప్రత్యర్థులు చిన్న చిన్న సమస్యలను సృష్టించి అల్లర్లు చెలరేగేలా ప్రేరేపిస్తున్నారు అని ఆరోపించారు. ఇదిలా ఉండగా ఈనెల 14 ఎంపీడీవో సమక్ష లోపంచాయతీ కార్యదర్శి మధ్య ఉన్న వివాదంలో మాట్లాడుతుండగా, మరో పంచాయతీ కార్యదర్శి మల్లేశం తలదూర్చడంవల్లనే గొడవ జరిగిందని చెప్పుకొచ్చారు.నేను ఎంపీడీఓ, ఎంపీఓకు ఫిర్యాదు చేయడానికి వస్తేనే మరో పంచాయతీ కార్యదర్శి మల్లేశం నన్ను సర్పంచ్ అని చూడకుండా కుర్చీ తీసుకుని కొట్టడానికి వచ్చాడు. దాంతోనే గొడవ జరిగిందని వివరించారు. ప్రభుత్వ ఉన్నత అధికారులు ఎలాంటి పక్షపాతం లేకుండా నిజాలు తెలుసుకుని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామాభివృద్ధి కొరకు గ్రామంలో 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానుఅని సర్పంచ్ రాథోడ్ ఆనంద్ నాయక్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు వారు.రతన్ సింగ్, మోహన్, కుమార్, లోక్య నాయక్, దేవ్ సింగ్, బోజ్య తదితరులు పాల్గొన్నారు.

# సేవకే వన్నె తెచ్చిన సారథి

## డాక్టరేట్ నంది అవార్డు అందుకున్న రోంపల్లి సంతోష్ కుమార్
## రాజకీయాల్లో చాణక్యం, సేవలో తనదైన ముద్ర, ఆధ్యాత్మికతలో అగ్రగామి







**తాండూరు, ఆగస్ట్ 23 (జనంసాక్షి)**
నిస్వార్థ సేవ, నిబద్ధత గల నాయకత్వం, ఆధ్యాత్మిక చింతన.. ఈ మూడింటి కలయికే రోంపల్లి సంతోష్ కుమార్. రాజకీయ రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటూనే, సామాజిక, ఆధ్యాత్మిక రంగాల్లో చేస్తున్న విశేష కృషికి గాను ఆయనకు అత్యంత ప్రతిష్టాత్మక డాక్టరేట్ నంది అవార్డు లభించింది. ఈ అవార్డు రావడంతో ఆయన అభిమానులు, అనుచరుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

రాజకీయాల్లో సంతోష్ కుమార్ ప్రస్థానం ఒక ఉద్యమంలా సాగింది. పార్టీ కోసం అహర్నిశలు శ్రమించే తత్వం, కార్యకర్తల కష్టసుఖాల్లో పాలుపంచుకోవడం ఆయన ప్రత్యేకత. ఏ సమస్య వచ్చినా ముందుండి పరిష్కరించే నాయకుడిగా, ప్రజా సమస్యలపై గళమెత్తే గొంతుకగా ఆయనకు పేరుంది. ముఖ్యంగా యువతను రాజకీయాల్లోకి తీసుకురావడంలో, వారికి దిశానిర్దేశం చేయడంలో ఆయన పాత్ర అనిర్వచనీయం.



**సేవా కార్యక్రమాల్లో తనదైన శైలి**

మానవ సేవే మాధవ సేవ అనే నినాదాన్ని తూచా తప్పకుండా పాటించే వ్యక్తి సంతోష్ కుమార్. కరోనా మహమ్మారి సమయంలో ప్రాణాలకు తెగించి వేలాది కుటుంబాలకు నిత్యావసర సరుకులు, మందులు అందించారు. పేద విద్యార్థులకు ఫీజులు చెల్లించడం, పుస్తకాలు పంపిణీ చేయడం, ప్రతిభావంతులకు స్కాలర్‌షిప్‌లు అందించడం ఆయన దినచర్యలో భాగం. ఆయన చేసే సేవలో ఆర్భాటం ఉండదు, ఆత్మీయత మాత్రమే ఉంటుందని స్థానికులు చెబుతుంటారు.

**ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుగ్గా..**

రాజకీయ, సేవా కార్యక్రమాలతో పాటు ఆధ్యాత్మిక రంగంలోనూ సంతోష్ కుమార్ చురుకైన పాత్ర పోషిస్తున్నారు. హిందూ ధర్మ పరిరక్షణ, దేవాలయాల పునరుద్ధరణ, హనుమాన్ జయంతి, వినాయక చవితి వంటి పండుగలను ఘనంగా నిర్వహించడం, ఆధ్యాత్మిక ప్రవచనాలు ఏర్పాటు చేయడం వంటివి చేస్తున్నారు. యువతలో ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఆయన పనిచేస్తున్నారు.

**అవార్డుకు గుర్తింపు**

ఈ మూడు రంగాల్లో ఆయన చేస్తున్న కృషిని గుర్తించిన అంతర్జాతీయ స్థాయి సామాజిక సేవా సంస్థ ఆయనకు డాక్టరేట్ తో కూడిన నంది అవార్డును ప్రకటించింది. ఇటీవల హైదరాబాద్ లో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ప్రముఖుల చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా రోంపల్లి సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఈ అవార్డు నాకు లభించిన గౌరవం కాదు, నాపై ఉన్న బాధ్యత. ప్రజలకు, సమాజానికి మరింత సేవ చేసేందుకు ఇది నాకు స్ఫూర్తినిస్తుంది. నన్ను ఆదరిస్తున్న ప్రతి ఒక్కరికీ పాదాభివందనం అని తెలిపారు.










# మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యం

## కౌకుట్ల జీవన్ రెడ్డి

**కీసర, ఆగష్టు 23 (జనంసాక్షి) :** ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యమని పేర్కొంటూ, కాలనీలోని సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని కౌకుట్ల జీవన్ రెడ్డి అన్నారు. నాగారం డివిజన్ రాంపల్లి పరిధిలోని శు భం ఎన్‌క్లేవ్‌లో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ సమస్యలను కాంగ్రెస్ నాయకుడు కౌకుట్ల జీవన్ రెడ్డి స్థానికులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో దెబ్బతిన్న రోడ్లు, సక్రమంగా లేకపోయిన డ్రైనేజీ వ్యవస్థ కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపడతామని జీవన్ రెడ్డి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ రాజ్, సంయుక్త కార్యదర్శి రామకృష్ణ, శుభం కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాములు, వంశీ, కాలనీ వాసులు పాల్గొన్నారు.



# ప్రజారోగ్యానికి జనవిజ్ఞాన వేదిక అండ

### 132వ నెల ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

### బీపీ, షుగర్‌తో పాటు పలు వైద్య పరీక్షలు

### ఆరోగ్య చైతన్యంపై ప్రముఖుల పిలుపు







**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 23 (జనంసాక్షి)**

ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన 132వ నెల ఉచిత బీపీ, షుగర్ వైద్య శిబిరం విశేష స్పందనతో విజయవంతమైంది. చక్రిపురంలోని శ్రీ చక్రి విద్యానికేతన్ హైస్కూల్‌లో ఆదివారం జరిగిన ఈ మెగా మెడికల్ క్యాంపులో వందలాది మంది ప్రజలు ఆరోగ్య పరీక్షలు చేయించుకోగా, ముఖ్య అతిథిగా హాజరైన ములుగు ప్రతాప్ రెడ్డి జనవిజ్ఞాన వేదిక సేవలను అభినందించారు.

**ప్రజా ఆరోగ్య నికి జేవీవీ సేవలు ఆదర్శం : ప్రతాప్ రెడ్డి**

జనవిజ్ఞాన వేదిక కాప్రా, కీసర, మల్కాజిగిరి మండల కమిటీల ఆధ్వర్యంలో శ్రీ చక్రి విద్యానికేతన్ హైస్కూల్ లో యశోద హాస్పిటల్స్ సికింద్రాబాద్ సౌజన్యంతో 132వ నెల (మెగా) బీపీ, షుగర్ ఉచిత వైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చక్రి విద్యానికేతన్ పాఠశాల కరస్పాండెంట్ ములుగు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య సంక్షేమం కోసం జనవిజ్ఞాన వేదిక నిరంతరం చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆరోగ్య అవగాహన కల్పిస్తూ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం ద్వారా సమాజానికి ఎంతో మేలు జరుగుతోందని పేర్కొన్నారు. ప్రస్తుతం బీపీ, షుగర్ వంటి జీవనశైలి వ్యాధులు అన్ని వయసుల వారిలో పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

**ప్రజారోగ్యమే జనవిజ్ఞాన వేదిక ధ్యేయం : ఆనంద్ కుమార్**

జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆనంద్ కుమార్ మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య పరిరక్షణే సంస్థ ప్రధాన లక్ష్యమని అన్నారు. వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చికిత్స తీసుకోవడం ద్వారా తీవ్రమైన సమస్యలను నివారించవచ్చని తెలిపారు. ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని ప్రజలకు సూచించారు.

**ఆరోగ్య చైతన్యమే ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది : ఎం.శ్రీనివాస్, పి.నాగరాజు**

జెవివి రాష్ట్ర నాయకులు ఎం.శ్రీనివాస్, పి.నాగరాజు మాట్లాడుతూ.. శాస్త్రీయ దృక్పథంతో పాటు ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించేందుకు జనవిజ్ఞాన వేదిక కృషి చేస్తోందన్నారు. జీవనశైలి మార్పుల కారణంగా పెరుగుతున్న బీపీ, షుగర్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ వైద్య శిబిరంలో యశోద హాస్పిటల్స్ వైద్య బృందం ఆధ్వర్యంలో జనరల్ మెడిసిన్, గుండె సంబంధిత పరీక్షలు, ఎముకలు–కీళ్ల వ్యాధుల నిర్ధారణ, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ దినేష్ నెమిలే సహకారంతో దంత వైద్య సేవలు, అనిల్ కుమార్ ప్లానెట్ ఆప్టికల్ సహకారంతో కంటి పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు తోట శ్రీనివాస్, కోశాధికారి జెన్నీ, నాయకులు సోమయ్యచారి, నరసింహారావు, నాగేశ్వరరావు, శేషగిరిరావు, నవీన్, వెంకయ్య, చిందం హరి, రమణ, వందన, శశిధర్ రెడ్డి, మధు, వైద్యులు విద్యాసాగర్, జయరాజ్, దేవిక, నవనీత, సంగీత, సైకాలజిస్ట్ డాక్టర్ మనోహర్, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







# పారిశ్రామిక పురోగతికి ఆర్‌బి పవర్ సెంటర్ తోడ్పాటు ప్రశంసనీయం

### ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి • ఆధునిక సౌకర్యాలతో ఆర్.బి పవర్ సెంటర్ నూతన కార్యాలయం ప్రారంభం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగష్టు 24 (జనంసాక్షి)**

కుషాయిగూడ ఇండస్ట్రియల్ ఏరియాలో విస్తరణ.. నాణ్యమైన సేవలు, సాంకేతిక పరిష్కారాలతో ముందుకు సాగుతున్న ఆర్మీ సంస్థకు ఆర్.బి పవర్ సెంటర్ సంస్థ పట్ల ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రశంసలు కురిపించారు. విద్యుత్, పారిశ్రామిక అవసరాలకు సమగ్ర పరిష్కారాలను అందిస్తూ విశ్వసనీయ సంస్థగా గుర్తింపు పొందిన ఆర్.బి పవర్ సెంటర్ హైదరాబాద్ ఈసీఐఎల్ సమీపంలోని కుషాయిగూడ ఇండస్ట్రియల్ ఏరియాలో నూతన కార్యాలయాన్ని ప్రారంభించింది. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి ఆదివారం ఈ కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించి సంస్థ అభివృద్ధిని అభినందించారు. పారిశ్రామిక రంగంలో వేగంగా ఎదుగుతున్న ఆర్.బి పవర్ సెంటర్ సంస్థ మరో



ముందడుగు వేస్తూ కుషాయిగూడ ఇండస్ట్రియల్ ఏరియాలో అత్యాధునిక సౌకర్యాలతో నూతన కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. పరిశ్రమలు, వ్యాపార సంస్థలు అభివృద్ధి చెందడం ఆర్థిక పురోగతికి కీలకమని పేర్కొన్నారు. నాణ్యత, నమ్మకం, సమయపాలనను ప్రాధాన్యంగా తీసుకుని సేవలందిస్తున్న ఆర్.బి పవర్ సెంటర్ వంటి సంస్థలు పారిశ్రామిక రంగానికి బలమైన అండగా నిలుస్తున్నాయని అన్నారు. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకుని సేవలను విస్తరించడం అభినందనీయమని కొనియాడారు. పరిశ్రమల అభివృద్ధి ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు మెరుగైన సేవలు అందించే సంస్థల అవసరం నేటి పరిస్థితుల్లో మరింత పెరిగిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నూతన కార్యాలయం సంస్థ వ్యాపార విస్తరణకు, వినియోగదారులకు మరింత చేరువ కావడానికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.




**నాణ్యత, నమ్మకంతో ముందుకు సాగుతున్న ఆర్.బి పవర్ సెంటర్ : సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి**

సేవా నాణ్యత, వినియోగదారుల విశ్వాసమే ఏ సంస్థకైనా నిజమైన మూలధనమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి అన్నారు. ఆర్.బి పవర్ సెంటర్ అదే సూత్రంతో ముందుకు సాగుతూ మార్కెట్‌లో ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుందని పేర్కొన్నారు.

**నాణ్యత, విశ్వసనీయతకు ఆర్.బి పవర్ సెంటర్ కట్టుబడి ఉంది : ఆర్. గురు బ్రహ్మారెడ్డి**

ఆర్.బి పవర్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్ గురు బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ.. విద్యుత్ పరికరాలు, పారిశ్రామిక అవసరాలకు సంబంధించిన సేవలను మరింత విస్తృతంగా అందించేందుకు నూతన కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నిపుణుల సేవలు, వినియోగదారుల సంతృప్తే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. భవిష్యత్తులో సంస్థ కార్యకలాపాలను మరింత విస్తరించి పారిశ్రామిక రంగానికి ఉత్తమ సేవలు అందించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. కార్యక్రమానికి కుటుంబ సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రముఖులు సంస్థ సిబ్బంది తదితరులు హాజరై నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

